ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 28 మే 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 | కనిష్ఠం : 23.0



శ్రీశైలం ప్రాజెక్టుకు వరద

- సుంకేసుల ప్రాజెక్టు నుంచి 4,462 క్యూసెక్కులు రాక
- ఎడమ గట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి
- ఎంజీకేఎల్ఐ కాలువ ద్వారా 800 క్యూసెక్కుల నీటి విడుదల

6

కోతి విడుపు

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం ఫత్తేపురం మైసమ్మ వద్ద మంగళవారం ఓ కోతి చెట్టు కొమ్మను పట్టుకొని విన్యాసాలు చేసింది. దానికి వేలాడుతూ ఉయ్యాల ఊగింది. కొద్దిసేపయ్యాక ఆ కొమ్మను పట్టుకొని గట్టిగా లాగింది. అది ఎంతకూ రాకపోవడంతో బలాన్నంతా ఉపయోగించింది. కొమ్మ తెగిపోవడంతో కోతి కిందే ఉన్న ఓ కారుపై పడింది. దాంతో విజయం సాధించినట్లు ఆ కొమ్మను చేత పట్టుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. కోతి ఆట విడుపును చూసిన పలువురు సరదాగా నవ్వుకున్నారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

ఈ కొమ్మను ఎలాగైనా తెంచుతా..



అమ్మో వస్తలేదు.. కొమ్మో నేనో తేలిపోవాలి..



అయ్యో కిందపడ్డానే..



క్లిక్.. క్లిక్..

హమ్మయ్యా కొమ్మ దొరికింది.. అట్లుంటది మనతోని..



వానాకాలం సాగు

లక్ష్యం ఖరారు

మహబూబ్‌నగర్‌లో 3.46 లక్షల ఎకరాల్లో..
నారాయణపేట జిల్లాలో 4.36 లక్షల ఎకరాల్లో..

- పంటలు సాగవుతాయని అంచనా వేసిన అధికారులు
- పాలమూరులో వరి.. 'పేట'లో పత్తి అధికంగా సాగు
- బోనస్‌తో సన్నాలు వేసేందుకు ఆసక్తి
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు



ఊట్కూర్ మండలం ఏర్కట్‌పల్లిలో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు



మహబూబ్‌నగర్ జిల్లా మన్నూర్‌పల్లిలో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

పాలమూరు/నారాయణపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల వానాకాలం సాగు ప్రణాళిక ఖరారైంది. పాలమూరులో 3,46,830 ఎకరాల్లో పంటలు వేస్తారని అంచనా వేయగా, నారాయణపేట జిల్లాలో 4.36 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కానున్నట్లు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు రెండు జిల్లాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సారి వారం రోజుల ముందే రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు గత మూడు నాలుగు రోజులుగా ముసురు వర్షాలు కురుస్తున్నాయి. దాంతో రైతులు పంటలు వేసేందుకు పొలాలను దున్నించి, సిద్ధం చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో గత వానాకాలంలో 3,31,498 ఎకరాల్లో వివిధ పంటలు వేయగా, ఈ సారి 3,46,830 ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు అంచనా వేశారు. వర్షాలు అనుకూలిస్తే దాదాపు 3.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావొచ్చని చెబుతున్నారు. ధాన్యం సన్న రకాలపై క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో అధికంగా వరి సాగవుతుందని భావిస్తున్నారు.

పాలమూరు జిల్లాలో గత ఏడాది సాగు చేసిన, ఈ ఏడాది సాగు చేయనున్న పంటల వివరాలు(ఎకరాల్లో..)

పంట	2024-25	2025-26
వరి	1,94,982	2,00000
మొక్కజొన్న	22,583	30,000
జొన్నలు	16,280	18,000
రాగులు	110	150
పత్తి	82,482	85,000
ఆముదం	330	330
నువ్వులు	47	60
కందులు	11,388	10,000
ఇతరాలు	3296	3300
మొత్తం	3,31,498	3,46,830

జిల్లాలో నిల్వ ఉన్న ఎరువుల వివరాలు

ఎరువు	నిల్వ (మెట్రిక్ టన్నుల్లో)
యూరియా	6,891.93
డీఏపీ	3,408.61
ఎంవోపీ	202.35
ఎస్ఎస్‌పీ	448.55
కాంప్లెక్స్	22,352.2
మొత్తం	33,303.64

వర్షాలు రాకముందే పత్తి విత్తరాదు



వర్షాలు రాకముందే రైతులు పత్తి విత్తనాలు వేయరాదు. వర్షం వస్తుందనుకొని వేస్తే.. అధిక ఉష్ణోగ్రతకు విత్తనాలు భూమిలోనే కరిగిపోతాయి. తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి దళారులు వచ్చి లూజుగా అమ్మే విత్తనాలు కొనొద్దు. విత్తనాలు, ఎరువులు దొరుకుతాయో లేదోనని టెన్షన్ పడొద్దు. అవసరమైనన్ని పత్తి, వరి విత్తనాలు అందుబాటులో ఉంచినం. మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు. జాగ్రత్తలు తీసుకుని నాణ్యమైన విత్తనాలు కొనుక్కోవాలి. విత్తనాలు, ఎరువులు కొన్న చోట తప్పక రశీదు తీసుకోవాలి.

- బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి, మహబూబ్‌నగర్

మొక్కజొన్న, పత్తితో పాటు కందులు, చిరుధాన్యాల సాగు మరింత పెరిగి అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

అధికంగా వరి సాగు..

మొత్తం 3,46,830 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేయగా, అందులో 60 శాతం మేర అంటే 2 లక్షల ఎకరాల వరకు వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. తర్వాత పత్తి 85,000 ఎకరాల్లో, మొక్కజొన్న 30,000, కందులు 10,000, జొన్నలు 18,000 ఎకరాల్లో సాగవుతాయని అంచనా రూపొందించారు.

60 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

జిల్లాకు 60 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం దశల వారీగా వాటిని సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, హాకా ద్వారా పంపిణీ చేయనుంది. విత్తనాలను తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా అందించనున్నారు. 14 వేల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. గతేడాది మొక్కజొన్న పంటకు మంచి ధర రావటంతో రైతులు ఈ సారి ఆ పంట ఎక్కువగా సాగు చేస్తారని అధికారులు భావిస్తున్నారు.

నారాయణపేట జిల్లాలో మొదలైన సాగు

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా గత ఐదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ముందస్తుగా సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని నర్వ, ఊట్కూర్, దామరగిద్ద మండలాల్లో పత్తి విత్తనాలు విత్తుతున్నారు. జిల్లాలో ఈ వానాకాలంలో 4.36 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. అధికంగా పత్తి 1,80,000 ఎకరాల్లో సాగు చేయనుండగా, తర్వాత వరి 1,75,000, కందులు 70,000 ఎకరాల్లో సాగు చేయనున్నారు. జొన్నలు 5,000, పెసర 5,000, ఇతర పంటలు 1,000 ఎకరాల్లో సాగవుతాయని అంచనా రూపొందించారు. జిల్లాలో నీటి వనరులు తక్కువగా ఉండటంతో వర్షాధార పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పత్తి తర్వాత కందులు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఒకే దుకాణంలో 183 కిలోల

ప్లాస్టిక్ బ్యాగ్స్

- రూ.15 వేల జరిమానా



హస్మి బ్రదర్స్ సూపర్ మార్కెట్‌లో బయటపడిన ప్లాస్టిక్ కవర్ల సంచులు

మహబూబ్‌నగర్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌పై చిత్తశుద్ధి ఏది? అన్న శీర్షికన రెండ్రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. అందులో అధికారులు బడాబాబులు, హోల్‌సేల్ వ్యాపారుల జోలికి వెళ్లకుండా రోడ్లపై చిరువ్యాపారులను పట్టుకుని జరిమానాలు విధిస్తున్నారని, మూలాలను వదిలేసి చిరువ్యాపారుల మీద పడితే ప్లాస్టిక్ నిషేధం అమలు కాదని ప్రచురితమైన ఆ వార్త అక్షర సత్యమైంది. బడాబాబుల వద్ద గుట్టలుగా ప్లాస్టిక్ బ్యాగ్‌లు మూలుగుతున్నాయని మంగళవారం నగరంలోని హస్మి బ్రదర్స్ సూపర్ మార్కెట్‌లో కార్పొరేషన్ అధికారుల తనిఖీ సందర్భంగా బయటపడింది. ఒకే దుకాణంలో 183 కిలోల ప్లాస్టిక్ బ్యాగ్‌లు బయటపడటంతో అధికారులు వాటిని ఆటోలో తరలించాల్సి వచ్చింది. చిరు వ్యాపారుల వద్దకెళ్లి కిలో, రెండు కిలోల కవర్లను స్వాధీనం చేసుకుని ఫొటోలకు ఫోజులిచ్చే అధికారులు.. బడాబాబులు, హోల్‌సేల్ వ్యాపారుల జోలికి మాత్రం వెళ్లడం లేదన్న విమర్శలు ఇప్పటికే పెద్దఎత్తున ఉన్నాయి. ఈ దుకాణంలో యథేచ్ఛగా 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం గల కవర్లను వినియోగిస్తున్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని నేరుగా జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయడంతో ఆ అధికారి ఆదేశాల మేరకు కార్పొరేషన్ శానిటేషన్ అధికారులు గురులింగం, రవీందర్‌రెడ్డి, వజ్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. తనిఖీలు చేయడానికి వెళ్లిన అధికారులకు అక్కడి వ్యాపారులు చుక్కలు చూపించారు. అధికారులు వెళ్లకుండా షెటర్లను కిందికి దించేశారు. చివరకు వారిపై ఒత్తిడి చేసి, షెటర్ తెరిచారు. దుకాణంలో తనిఖీ చేయగా, బహిరంగంగా ర్యాక్‌లో పెట్టి ప్లాస్టిక్ బ్యాగ్‌లను విక్రయిస్తున్నారు. 183 కిలోల వరకు కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా కొన్నింటిని వదిలేశారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో సదరు దుకాణం యజమానికి రూ.15 వేల జరిమానా విధించారు. ఇలా ఒక్క పెద్ద దుకాణంలోనే ఈ స్థాయిలో ప్లాస్టిక్ కవర్లు బయట పడ్డాయంటే.. నగరంలోని హోల్‌సేల్, బడా దుకాణాలన్నింటిలో తనిఖీలు చేస్తే అధిక మొత్తంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బయటపడనున్నాయి. ఈ విధంగా ప్లాస్టిక్ బయటకు వచ్చే మూలాలను కొడితేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. లేదంటే మరో దశాబ్దకాలమైనా ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టలేరన్న విషయం స్పష్టమవుతోంది.



చిన్నపొర్లలో కుంటను తలపిస్తున్న రోడ్డు

రోడ్లు జలమయం

- ఊట్కూర్ మండలంలో భారీ వర్షం

ఊట్కూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో ఐదు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షం పడింది. దాంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. రైతులు వర్షంలో విత్తనాలు వేశారు. మరికొందరు పొలాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. వర్షానికి ఊట్కూర్‌తో పాటు మండలంలోని పులిమామిడి, ఎడవెల్లి, చిన్నపొర్ల, మల్లెపల్లి, కొల్లూర్, పెద్దపొర్ల గ్రామాల్లో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. చిన్నపొర్లలో రోడ్లు కుంటలను తలపించాయి. ఓ వాటర్ ప్లాంట్, హోటల్‌లోకి నీళ్లు చేరాయి. రోజూ వర్షం పడుతుండటంతో ఇళ్ల మధ్యన నీరు నిలిచి, నడవటానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 28.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కల్యాణలక్ష్మి వరం : ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్నచింతకుంట, మే 27(ఆంధ్రజ్యోతి) నిరుపేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరం లాంటివని దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నచింతకుంట మండలం దమాగ్నాపూర్‌లో చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాలకు సంబంధించిన 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి, నాయకులు సురేందర్‌రెడ్డి, వెంకటేష్, ప్రదీప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లోపలి పేజీల్లో..



ఆయిల్‌పామ్
పంట పండింది
- నారాయణపేట జిల్లాలో 6,500 ఎకరాల్లో సాగు
- నాలుగేళ్ల తర్వాత వస్తున్న దిగుబడి

6

నాలుగేళ్లుగా ఎదురు చూపులు
- కులాంతర వివాహ జంటలకు అందని ప్రోత్సాహకం

7



కురుమూర్తి వాసా గోవిందా..
- అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు

6

పథకాల వినియోగంపై..

అవగాహన కల్పించాలి

- దిశ కమిటీ సమావేశంలో ఎంపీ డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 27(ఆంధ్రజ్యోతి): పేదలకు కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వినియోగంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహబూబ్‌నగర్ ఎంపీ, దిశ(జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) చైర్‌పర్సన్ డీకే అరుణ అధికారులకు సూచించారు. ఆ బాధ్యత జిల్లా అధికారులపై ఉందని చెప్పారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి దిశ సమావేశాన్ని నిర్వహించారు. అరుణ అధ్యక్షత వహించి, మాట్లాడారు. పథకాలు కేంద్రానివి అయినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నవి అయినా నిబంధనల మేరకు అమలు చేయాలన్నారు. సిఫారసులను పట్టించుకోవద్దని సూచించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు 252 యూనిట్లకు రూ.72.20 లక్షలు కేటాయించినట్లు వ్యవసాయ అధికారి మధుసూదన్ గౌడ్ తెలిపారు. జాతీయ ఆయిల్ సీడ్ మిషన్ కార్యక్రమం కింద వంట నూనెల ఉత్పత్తికి జిల్లాలో 1,250 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేందుకు రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా రెండు సంస్థలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అరుణ మాట్లాడుతూ ప్రత్యమ్నాయ పంటల సాగు కింద డిమాండ్ ఉన్న వేరుశనగ ద్వారా నూనె ఉత్పత్తికి ప్రాధాన్యం ఇచ్చి రైతులను ప్రోత్సహించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల యూనిట్ ధర రూ.కోటి అంటే గ్రామీణ ప్రాంత ప్రజలకు వినియోగంగా ఉండదని, యూనిట్ ధరను రూ.25 లక్షలకు తగ్గించాలని సూచించారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌పై సమీక్ష చేశారు. అటవీశాఖ జింకల పార్కు అభివృద్ధికి ప్రత్యేక ప్రాజెక్టు రూపొందించి, సీఆర్ నిధులతో చేపట్టాలన్నారు. బ్యాంకర్లు ఎంఎస్ఎంఈ, పీఎంఎఫ్ఈ పథకాలకు రుణ సహాయం అందించాలని కోరారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను భూమిలేని నిరుపేదలకు కేటాయించాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మక్తల్ మండలం అనుగొండలో ఆయిల్‌పామ్ విక్రయం కోసం తరలిస్తూ



మరికల్ మండలం జిన్నారంలో ఆయిల్‌పామ్ దిగుబడితో రైతు శ్రీపాద్‌రావు

ఆయిల్‌పామ్ పంట పండింది

- నాలుగేళ్ల తర్వాత చేతికి వస్తున్న దిగుబడి
- మక్తల్ కలెక్షన్ పాయింట్‌కు తరలింపు
- అశ్వారావుపేట ఆయిల్ కంపెనీకి విక్రయం
- నారాయణపేట జిల్లాలో 6,500 ఎకరాల్లో సాగు

నారాయణపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ రైతుల పంట పండింది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 6,500 ఎకరాల్లో 1600 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. 2019లో రైతులు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటల నుంచి ప్రస్తుతం దిగుబడి చేతికి అందుతోంది. ఆయిల్‌పామ్ గెలలను రైతులు జిల్లాలోని మక్తల్ మండల కేంద్రంలో ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన కలెక్షన్ పాయింట్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి అధికారులు ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట ఆయిల్ కంపెనీకి విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు 144 మంది రైతులు, 250 ఎకరాలకు సంబంధించి 366 టన్నుల ఆయిల్ పామ్ గెలలను కలెక్షన్ కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఎకరానికి 2 టన్నుల దిగుబడి వస్తుంది. ఏడు నుంచి ఎనిమిది సంవత్సరాల తర్వాత ఎకరానికి 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. 2023లో క్వింటాలుకు రూ. 12 వేల ధర పలుకగా, ప్రస్తుతం క్వింటాలుకు రూ. 20,058 ధర వస్తోంది.



మక్తల్ మండలం కర్నిలో రైతు అరోగ్యరెడ్డి అయిల్‌పామ్ తోటలో ఉద్యనశాఖ అదికారులు

సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం పోత్సహిస్తోంది. జిల్లాలో 2019-20లో పైలట్ ప్రాజెక్టు కింద ఈ పథకాన్ని ప్రారంభించినట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీలకు 90 శాతం, జనరల్ రైతులకు 80 శాతం సబ్సిడీపై అయిల్ పామ్ మొక్కలతో పాటు డ్రిప్ పరికరాలను అందిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలిక ఆదాయం వచ్చే ఆయిల్‌పామ్‌ను సాగు చేసుకొని అధిక లాభాలు ఆర్జించాలని సూచిస్తున్నారు. సాగు చేసిన నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి వస్తుందని, ఆ లోపు అంతర పంటలను సాగు చేసుకోవచ్చని చెప్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో 50 నుంచి 57 అయిల్ పామ్ మొక్కలను నాటుకోవచ్చు. నల్లరేగడి, ఎర్ర భూములు సాగుకు అనుకూలం. సాగు పెట్టుబడిగా ప్రభుత్వం ఎకరానికి రూ. 2100 చొప్పున అందిస్తుంది. అంతర పంటల సాగుకు మరో రూ.2,100 ఇస్తోంది. నాలుగేళ్ల వరకు ఈ పెట్టుబడి సాయం కొనసాగుతుంది.

ఏడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు



నేను ఎడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశాను. ఇప్పటివరకు మూడు సార్లు గెలలు కోశాం. మొదటి సారి దిగుబడి సరిగా రాలేదు. 15 రోజుల తర్వాత 13 క్వింటాళ్లు, మరోసారి రెండు టన్నులు, ఇంకోసారి రెండు టన్నుల దిగుబడి వచ్చింది. లక్ష రూపాయల వరకు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం మూడు ఎకరాల్లో కోతలు కొనసాగుతున్నాయి. కూలీల అవసరం లేకుండా నేను, నా భార్య ఇద్దరం పని చేసుకుంటున్నాం.

కాశీం,
పెద్దకడుమూరు, నర్వ మండలం

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



జిల్లాలో వచ్చే ఏడాది నాటికి 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. సాగుకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీతో ఆయిల్‌పామ్ సాగు చేసుకొని రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చు.

చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, నారాయణపేట

అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లికార్జున్



2006లో ప్రభుత్వం ఇచ్చిన పోడు పట్టా బుక్కులు చూపుతున్న సార్లపల్లి చెంచులు

దోమలపెంట, మే 27 (ఆంధ్రజ్యోతి) : చెంచు గిరిజనులు పోడు భూములను సాగు చేయకుండా అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, సార్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాసమొల్లబావి వద్ద ఆయన మాట్లాడారు. 2006లో అప్పటి ప్రభుత్వం రాసమొల్ల బావి వద్ద 10 చెంచు కుటుంబాలకు పోడు పట్టాలు ఇచ్చిందని తెలిపారు. రెండు సంవత్సరాలుగా ఆ భూములను సాగు చేయనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లమల అడవి నుంచి చెంచులను వెళ్లగొట్టేందుకే ఇలాంటి ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. తమ హక్కులను కాలరాస్తున్న అటవీశాఖ అధికారుల తీరుకు నిరసనగా బుధవారం శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాసమొల్లబావి వద్ద రాస్తారోకో చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో చెంచులు బోడయ్య, పెద్దులు, మానయ్య, వెంకటయ్య, భయ్యన్న ఎల్లమ్మ, ఈదమ్మ, గురువమ్మ తదితరులు పాల్గొన్నారు.

విషపూరితం అవుతున్న బీజేపీ ప్రభుత్వం

- పౌరహక్కుల సంఘం నాయకుడు జక్క బాలయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు జక్క బాలయ్య

అచ్చంపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రోజురోజుకూ విషపూరితం అవుతోందని పౌరహక్కుల సంఘం నాయకుడు జక్క బాలయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని మరింత నిర్వీర్యం చేస్తోందన్నారు. మనుషులను చంపడమే ఒక నేరమైతే, వారి మృతదేహాలను కుటుంబీలకు ఇవ్వకపోవడం, పైగా ప్రభుత్వమే దహనం చేయడం దారుణమన్నారు. ఈ సంఘటనతో ప్రభుత్వ స్వభావం హింసాత్మకమని మరోసారి రుజువైందన్నారు. ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది చనిపోయిన సంఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం నాయకులు పంబలి బాలయ్య, ఎడ్ల అంబయ్య, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, మురళి, వెంకటేశ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు..

మక్తల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని జక్లేర్ వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొని ఓ వృద్ధుడు మరణించాడు. నర్వ మండలంలోని రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు కొండారెడ్డి (60) మంగళవారం జక్లేర్ స్టేజీ వద్ద నిత్యావసర సరుకులు కొనుగోలు చేశాడు. అనంతరం 167వ నెంబరు జాతీయ రహదారిని దాటుతుండగా, రాయచూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నది. తీవ్రంగా గాయపడిన అతడు కొద్దిసేపటికే ప్రాణాలు విడిచాడు.

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద

- ఎడమ గట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి

దోమలపెంట/అమరచింత, మే 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దులోని శ్రీశైలం ప్రాజెక్టుకు స్వల్పంగా వరద కొనసాగుతోంది. ప్రస్తుతం ఎగువనున్న సుంకేసుల ప్రాజెక్టు నుంచి 4,462 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయంలోకి చేరుతోంది. దీంతో ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో 10,404 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 4.758 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ప్రస్తుతం ఎంజీకేఎల్ఐ కాలువ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మంగళవారం జలాశయంలో నీటి మట్టం స్వల్పంగా తగ్గింది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, ప్రస్తుతం 818.10 అడుగుల మేరకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను, 39.4343 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో 2.60 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు.



జూరాల జలాశయానికి చేరిన వరద

'జూరాల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న వర్షాలతో జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం 2.653 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరింది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో నీరు 5.684 క్యూసెక్కులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.684 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిర్మాణ పనులు వేగవంతం చెయ్యాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్
- మద్దూరు మండలంలో విస్తృత పర్యటన

మద్దూరు, కొత్తపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. నారాయణపేట జిల్లా, మద్దూరు మండలంలో మంగళవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ఎస్‌డీఎఫ్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో చేపట్టిన బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకు ముందు నారాయణపేట మండలం బండగొండ నుంచి మద్దూరు మండలం చెన్వార్ వరకు నిర్మాణంలో బీటీ రోడ్డును పరిశీలించారు. అనంతరం మోమిన్‌పూర్ బీటీ రోడ్డును పరిశీలించారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆ తర్వాత మోమిన్‌పూర్ నుంచి నారాయణపేట మండలం గనిమోనిబండ, అభంగాపూర్, లింకు రోడ్డు, మద్దూరు నుంచి రెనివట్ల, రాళ్లబాయి, రెనివట్ల నుంచి మోమిన్‌పూర్ వరకు పూర్తయిన బీటీ రోడ్డును పరిశీలించారు. గడువులోపు పనులను పూర్తి చేయించాలని ఈఈ హీర్యానాయక్, ఏఈ విలోక్‌లను ఆదేశించారు. అలాగే కొత్తపల్లి మండలంలోని భూనీడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవనాన్ని తనిఖీ చేశారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. మద్దూరు మండల కేంద్రంలో రూ. 30 కోట్ల వ్యయంతో చేపట్టిన సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. విద్యాసంస్థల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు. ముందు అనుకున్న ప్లాన్‌ను కొంత మార్చామని, నేలను పరిశీలిస్తున్నామని తెలిపారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పనులు ప్రారంభించలేదని కాంట్రాక్టర్ వివరించారు. ఇసుక కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నా, రావడంతో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ఇసుక రవాణాకు ఆటంకం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మద్దూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కొనసాగుతున్న భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను తనిఖీ చేశారు.



అప్పిరెడ్డిపల్లి నుంచి రెనివట్ల బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ

కల్వకుర్తి, మే 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తుర్కలపల్లి, పంజుగుల గ్రామాల్లో గర్భిణులకు మెడికల్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన మెడికల్ కిట్లను గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, శేఖర్‌గౌడ్, భీమయ్య, ఖాజా, నాగరాజు, రాములు, శ్యామ్, మల్లయ్య, పరశురాములు, సలాం, భాస్కర్, వెంకటయ్య, సత్యనారాయణ, రాములు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ఉన్నారు.



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కురుమూర్తి వాసా గోవిందా...

- అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు
- కురుమూర్తి క్షేత్రంలో భక్తుల సందడి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట, మే 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని కురుమూర్తి క్షేత్రానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమావాస్య సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జాతర మైదానం భక్తులతో కిక్కిరిసింది. కురుమూర్తి వాసా గోవిందా.. గోవింద అంటూ భక్తుల నామస్మరణతో క్షేత్రం మారుమోగింది. స్వామి దర్శనానికి రాజగోపురం నుంచి కాంచన గుహ వరకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. స్వామికి దాసంగాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అలాగే జాతర మైదానంలోని దుకాణాల వద్ద భక్తుల సందడి కనిపించింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

- జోగులాంబ గద్వాల జిల్లాలో పలుచోట్ల అన్నదానం
- బీచుపల్లిలో పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఎర్రవల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచి బీచుపల్లిలోని కృష్ణానదిలో పుణ్యస్నానాలాచరించి ఆంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఈవో రామన్‌గౌడ్ పరిశీలించారు.

ఆదిశిలా క్షేత్రంలో..



లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు

మల్దకల్, మే 27 (ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని ఆదిశిలా క్షేత్రం మల్దకల్‌లోని స్వయంభువు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వాల్మీకి పూజారులు తిమ్మప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు మాట్లాడుతూ రాత్రి ఏడు గంటలకు స్వామివారి రథోత్సవం, పల్లకీసేవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. పురాతనమైన మల్దకల్ శ్రీతిమ్మప్ప స్వామి క్షేత్రానికి వేలాదిమంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారని అన్నారు.

ఘనంగా పాగుంట వెంకన్న కల్యాణం



ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కేటీదొడ్డి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేటీదొడ్డి, వెంకటాపురం, నందిన్నె, చింతలకుంట తదితర గ్రామాల్లో మంగళవారం అమావాస్య సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వెంకటాపురంలోని కొండపై వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని అమావాస్య సందర్భంగా ఆలయ పెద్దలు, అర్చకులు ఘనంగా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

హ్యాండ్లూమ్ కంపెనీ పని తీరు అద్భుతం

- మక్తల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధ



అమరచింత చేనేత హ్యాండ్లూమ్ కంపెనీని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

అమరచింత, మే 27(ఆంధ్రజ్యోతి) : అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ పని తీరు అద్భుతంగా ఉందని మక్తల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధ అన్నారు. నారాయణపేట జిల్లా, అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీని మంగళవారం ఆమె పరిశీలించారు. చేతి మగ్గాలపై నేస్తున్న చీరలు, పట్టు వస్త్రాలు, కుట్టు మిషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా క్లస్టర్ అభివృద్ధి, నేత కార్మికుల పనితీరు, ప్రభుత్వ సహకారం తదితరాలపై చిత్ర ప్రదర్శన ద్వారా సీఈవో చంద్రశేఖర్ ఆమెకు వివరించారు. అనంతరం గవినోళ్ల రాధ మాట్లాడుతూ ఇక్కడ తయారైన చీరలను ఈ-మార్కెట్ ద్వారా భారత దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా విక్రయిస్తుండటం మంచి పరిణామం అన్నారు. చైర్‌పర్సన్ వెంట నాయకులు గవినోళ్ల లక్ష్మారెడ్డి, కేశం శీలన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

మూడు సంవత్సరాల బాలికపై బాలుడి లైంగిక వేధింపులు

» కేసు నమోదు, నిందితుడి రిమాండ్

జడ్చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : మూడు సంవత్సరాల బాలికపై ఓ బాలుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ మునిసిపాలిటీలో చోటు చేసుకున్నది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి మూడు సంవత్సరాల బాలికపై అదే ప్రాంతానికి చెందిన 15 సంవత్సరాల బాలుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అది గమనించిన తల్లిదండ్రులు బాలికను చికిత్స కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం జరిగిన సంఘటనపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను ఆసుపత్రిలో అబ్జర్వేషన్‌లో ఉంచిన పోలీసులు అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై అత్యాచారయత్నంతో పాటు పోక్సో కేసు నమోదు చేశారు. జువైనల్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


అబ్దుల్లా (ఫైల్)

వనపర్తి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అబ్దుల్లా (48) అనే వ్యక్తి గేదెల పెంపకంతో తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ మధ్య కాలంలో ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశాడు. కుటుంబ పోషణ, పిల్లల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు రోజురోజుకు పెరిగి రూ. 10 లక్షలు అయ్యాయి. వాటిని తీర్చే మార్గంలేక మనస్తాపం చెందాడు. ప్రతీరోజు మాదిరిగానే తెల్లవారుజామున అందరూ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుడి భార్య పార్వతమ్మ గుర్తించి ఇంటి చుట్టుపక్కల వారిని తీసుకొచ్చేసరికి మృతి చెందాడు.

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం

పాన్‌గల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హెడ్ కానిస్టేబుల్ రోశయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కేతేపల్లికి చెందిన శివ(21) హైదరాబాద్‌లో కారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 24న హైదరాబాద్ నుంచి స్వగ్రామం కేతేపల్లికి వచ్చాడు. 25న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. చుట్టుపక్కల బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా.. ఆచూకీ లభించలేదు. సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన మహంకాళి ఫోన్ చేసి గ్రామ శివారులో ఎర్ర కురుమయ్య వ్యవసాయ పొలంలో ఓ వ్యక్తి వేప చెట్టుకు బెల్టుతో ఉరి వేసుకుని చనిపోయినట్లు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా.. శివగా గుర్తించారు. ఘటనపై తండ్రి నాగేంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొలెరో వాహనాన్ని ఢీకొని ఆటో బోల్తా

» చిన్నారి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన శ్రీవాణి (ఫైల్)

హన్వాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న బొలెరో, ఆటో ఢీకొని బోల్తా పడటంతో ఓ చిన్నారి మృతి చెందింది. మరో వృద్ధురాలు, డ్రైవర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ (65) మనవరాలు శ్రీవాణి (9)తో కలిసి ఆటోలో వేపూరు నుంచి హన్వాడకు బయలుదేరారు. అమ్మాపూర్‌తండా సమీపంలోని మలుపు వద్ద, చిన్నదర్పలికి చెందిన బొలెరో వాహనం హన్వాడ నుంచి వేపూర్ వైపునకు అతి వేగం గా వస్తూ ఆటోను ఢీకొన్నది. దీంతో ఆటో రెండు మూడు పల్టీలు కొట్టడం తో అవ్వ, మనమరాళ్ల తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబు లెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో శ్రీవాణి మృతి చెందింది. వృద్ధురాలు వెంకటమ్మ పరిస్థితి విషమంగా ఉంది. డ్రైవర్ బాలరాజుకు కూడా గాయాలయ్యాయి. చిన్నారి శ్రీవాణి రామన్నపల్లి పాఠశాలలో 4వ తరగతి చదువుకుంటోంది. ఇటీవల గురుకుల పాఠశాల ప్రవేశం కోసం పరీక్ష రాసినట్లు ఉపాధ్యాయుడు మల్లేశ్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పుట్టింటికి వెళ్లి వస్తానని... ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

నవాబ్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : పుట్టింటికి వెళ్లి వస్తానని భర్తకు చెప్పి ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లిన మహిళ ఇంటికి తిరిగి రాలేదు. మహబూబ్‌నగర్ మండలం, బోయపల్లిలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నవాబ్‌పేట మండలం కామారం గ్రామానికి చెందిన స్వప్నకు బోయపల్లికి చెందిన కొండయ్యతో వివాహం జరిగింది. వారికి కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 18న స్వప్న తన తల్లిగారి ఊరు కామారం గ్రామానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరింది. ఈ నెల 22న కొండయ్య అక్కడకు వెళ్లి విచారించగా వారు హైదరాబాద్‌లోని బంధువుల వద్ద ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమెను స్వగ్రామానికి తీసుకొచ్చాడు. కానీ తాను తల్లిగారింటికి వెళ్తున్నానని చెప్పి పిల్లలతో కలిసి వెళ్లిపోయింది. తన భార్య ఓ అపరిచిత వ్యక్తితో కలిసి వెళ్లిపోయిందని కొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని.. ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి

తెలకపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఇష్టం లేని పెళ్లి చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారని, ఓ యువతి (24) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన యువతి హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. కుటుంబ సభ్యులు ఇంటికి రమ్మని పిలవడంతో సోమవారం నాగర్‌కర్నూల్‌లోని తమ ఇంటికి వచ్చింది. ఈ సందర్భంగా పెళ్లి చూపుల కోసం బంధువులు వస్తున్నారని తెలుసుకున్న ఆ యువతి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. యువతికి ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తండ్రిపై కొడుకుల దాడి

గండీడ్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పంపకాల విషయంలో తండ్రీకొడుకులు గొడవ పడి, తండ్రిని గాయపరచడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కొడుకులపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. లింగాయిపల్లి గ్రామానికి చెందిన దిడ్డి చెన్నయ్యకు పెద్ద మొగులయ్య, చంద్రయ్య ఇద్దరు కొడుకులు. ఇరువురు ఆస్తి పంపకాల విషయంలో తండ్రితో గొడవకు దిగగా, అడ్డువచ్చిన తల్లితో పాటు తండ్రి చెన్నయ్యను కొట్టారు. ఈ ఘటనలో గాయపడిన తండ్రి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇరువురికి కొడుకులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగేళ్లుగా ఎదురుచూపులు

» కులాంతర వివాహ జంటలకు అందని ప్రోత్సాహకం
» నిధుల విడుదలలో తీవ్ర జాప్యం



మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 27 (ఆంధ్రజ్యోతి) : కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రోత్సాహకం అందడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఎదురుచూపులు తప్పడం లేదు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ఆర్థిక భద్రత కల్పించడం, సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించడమే లక్ష్యంగా పోత్సాహకం అందిస్తోంది. గతంలో రూ. 50 వేలు ఇచ్చేవారు. ఆ ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం భారీగా పెంచింది. 2019, నవంబరు ఒకటిన పోత్సాహకాన్ని రూ. 2.50లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నా, లబ్ధిదారులకు నగదును అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో విమర్శలు వస్తున్నాయి. దాదాపు నాలుగేళ్లుగా నిధులు మంజూరు కాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. నిధులు మంజూరు కాలేదని, వస్తే ఇస్తామని సమాధానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాజంలో వస్తున్న మార్పు

మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కులాంతర వివాహాలు పెరుగుతున్నాయి. కులంపై గతంలో ఉన్న పట్టింపులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గతంలో కులంలోనే పెళ్లిళ్లు జరిగేవి. ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. కులం ప్రాధాన్యం తగ్గిపోయి ఇతర అంశాల వైపు దృష్టి సారిస్తున్నారు. కులం ఏదైనా అభిప్రాయాలు, అభిరుచులు కలిస్తే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటున్నారు. అలాగే పెద్దలు కూడా పట్టింపులను వదిలేసి సర్దుకుంటున్నారు. కొందరు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకుంటున్నారు. మరికొందరు పోలీసులను ఆశ్రయించి వివాహం చేసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రభుత్వం ద్వారా అందే సాయం వారికి ఆర్థిక భద్రత కల్పిస్తోంది. కానీ సకాలంలో డబ్బు అందకపోవడంతో ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కులాంతర వివాహం చేసుకున్న వారికి సకాలంలో ప్రోత్సాహకం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రోత్సాహకానికి అర్హుల వీరే ...

- పెళ్లి చేసుకున్న దంపతుల్లో ఒకరు తప్పనిసరిగా షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై ఉండాలి. మరొకరు ఇతర కులానికి చెందిన వారు ఉండాలి.
- యువతికి 18 ఏళ్ల వయసు, యువకుడికి 21 ఏళ్ల వయసు ఉండాలి. వివాహచట్టం 1965 కింద నమోదు అయి ఉండాలి. .
- పెళ్లి చేసుకున్న జంట వార్షిక ఆదాయం రూ.5 లక్షల కన్నా తక్కువ ఉండాలి
- మొదటి వివాహం అయిన వారికి మాత్రమే పోత్సాహకం ఇస్తారు.
- వివాహం అయిన ఏడాదిలోపు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.



దరఖాస్తు చేసుకోవడం ఇలా ...

వేర్వేరు కులాలకు చెందిన యువతీ యువకులు పెళ్లి చేసుకుంటే, సంబంధిత ఆధారాలతో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు పరిశీలించి అర్హులను గుర్తించి, ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. దీని ఆధారంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. వాటిని కులాంతర వివాహం చేసుకున్న జంటలకు అందిస్తారు.

32 జంటలకు మాత్రమే ప్రోత్సాహకం

మహబూబ్‌నగర్ జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు 122 జంటలు పోత్సాహకం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వారిలో 32 జంటలకు మాత్రమే నగదు అందింది. మిగతా వారు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నారు. నారాయణపేట జిల్లాలో 79 జంటలు దరఖాస్తు చేసుకోగా, 34 మందికి ప్రభుత్వ సాయం అందింది. ఇంకా 45 జంటలకు నగదు అందాల్సి ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 154 జంటలు దరఖాస్తు చేసుకోగా, 11 జంటలకు మాత్రమే పోత్సాహకం మంజూరయ్యింది. మరో 143 మంది నగదు మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు.

నిధులు వచ్చిన మేరకు అందిస్తున్నాం

కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం పోత్సాహకం అందిస్తోంది. సకాలంలో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన మేరకు అందిస్తున్నాం. ఇంకా నిధులు మంజూరు కావాల్సి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో మరో 90 మందికి పోత్సాహకం అందించాల్సి ఉంది. నిధుల మంజూరులో జాప్యం జరుగుతోంది. రాగానే లబ్ధిదారులకు అందిస్తాం.

- సుదర్శన్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి, మహబూబ్‌నగర్

కల్వర్టులు నిర్మించాలి

» అధికారులకు రైతుల విజ్ఞప్తి
» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
» పెద్దపొర్ల - ఉట్కూరు రహదారి పరిశీలన



ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామ రైతులతో కలిసి రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

ఊట్కూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : గాడిదల వాగుతో పాటు, మరో రెండు చిన్న వాగులపై కల్వర్టులు నిర్మించాలని పెద్దపొర్ల గ్రామ రైతులు, ప్రజలు అధికారులను కోరారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఊట్కూరు మండలంలోని పెద్దపొర్ల గ్రామం నుంచి గాడిదల వాగు మీదుగా ఊట్కూరు వరకు రైతులు సొంతంగా తలాయింత డబ్బు పోగు చేసి రహదారిని నిర్మించుకున్నారు. ఈ అంశంపై 'చేయి చేయి కలిపారు.. పొలాలకు రోడ్డు వేశారు' శీర్షకన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో సంబంధిత అధికారులు స్పందించారు. పంచాయతీ రాజ్ ఏఈ అజయ్‌రెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీవో లక్ష్మారెడ్డి రహదారిని పరిశీ లించారు. పెద్దపొర్ల గ్రామ రైతులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. రోడ్డుకు మధ్యలో ఉన్న మూడు వాగులపై కల్వర్టులు నిర్మించాలని వారు అధికారులను కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రహదారిని పరిశీలించినట్లు తెలిపారు.

రెండు రోజుల తర్వాత పంచాయతీరాజ్ డీఈతో కలిసి రహదారిని పరిశీలిస్తామని చెప్పారు. చేపట్టాల్సిన పనులను గుర్తించి అంచనాలను సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

'భారత్‌మాల' రోడ్డు పనుల అడ్డగింత

» పరిహారం చెల్లించాలంటూ రైతుల ఆందోళన
» సైట్ ఇన్‌చార్జి హామీతో విరమణ


రైతుల ఆందోళనతో భారత్‌మాల రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

గట్టు, మే 27 (ఆంధ్రజ్యోతి) : భారత్ మాల జాతీయ రహదారి నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి అవుతున్నా పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సేకరించిన భూములకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు, గంగిమాన్‌దొడ్డి రైతులు మంగళవారం రహదారి నిర్మాణ పనులను అడ్డుకొని రాస్తారోకో చేపట్టారు. పరిహారం చెల్లింపులో జాప్యంపై సైట్‌ఇన్‌చార్జి అఫ్జల్‌ను నిలదీశారు. తమకు న్యాయం జరిగే వరకు పనులను జరుగనిచ్చేది లేదంటూ వాగ్వాదానికి దిగారు. పరిహారం విషయంపై కలెక్టర్‌ను కలుద్దామని, తాను కూడా వస్తానని రైతులకు నచ్చచెప్పినా రైతులు ఆందోళన విరమించలేదు. కచ్చితమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని పట్టుబట్టారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చచెప్పారు. చివరకు సైట్‌ఇన్‌చార్జి స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతుల ఆందోళనకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు రైతులకు సంఘీభావం తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని చెప్పారు.

సర్వేకు సహకరించాలి

» భూమిని కోల్పోయే రైతులకు నష్టపరిహారంతో పాటు, ఉపాధి కోసం సాయం అందిస్తాం
» రెవెన్యూ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్
» తిప్రస్‌పల్లి, బాపూర్, పెద్దపొర్ల గ్రామాల్లో రైతుల పునరావాస గ్రామసభ



పెద్దపొర్ల గ్రామసభలో రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న రెవెన్యూ అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

ఊట్కూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ కోసం అధికారులు చేపడుతున్న సర్వేకు రైతులు సహకరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద ఉన్న భూమి మొత్తం కోల్పోయి, ఇళ్లు కోల్పోయిన రైతులకు నష్టపరిహారంతో పాటు, ప్రత్యామ్నాయంగా ఉపాధి కోసం ఆర్థిక సహాయం కూడా చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం పేట జిల్లా ఊట్కూర్ మండలంలోని తిప్రస్‌పల్లి, బాపూర్, పెద్దపొర్ల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. సభలో రైతుల అభిప్రాయాలు తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో పూర్తిగా భూములు కోల్పోతున్న రైతులు తమ వివరాలు ఇవ్వాలని అన్నారు. ఎవరికి ఎంత భూమి పోతున్నదో అధికారులు గ్రామాల్లో సర్వే చేస్తారని, సర్వేకు సహకరించాలని కోరారు. కాగా, తిప్రస్‌పల్లి గ్రామంలో ఎకరానికి రూ.60 లక్షలు ఇవ్వాలని రైతులు కోరారు. పెద్దపొర్ల గ్రామంలో ఎకరానికి ఎంత నష్టపరిహారం ఇస్తారో తేల్చాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వే పూర్తయిన తర్వాత కలెక్టర్, ఆర్డీవో నష్టపరిహారాన్ని చెబుతారన్నారు. ప్రస్తుతం పూర్తిగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్నాయం, ఉపాధికి సహకారం ఎలా అందించాలనే దానిపై అభిప్రాయాలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామసభల్లో తహసీల్దార్ చింత రవి, ఇరిగేషన్ అధికారులు కేతన్‌కుమార్, వెంకటప్ప, సర్వేయర్ రాజు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

సెప్టెంబరులో పీయూ స్నాతకోత్సవం

» పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కే ప్రవీణ
» వచ్చేనెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ

పాలమూరు యూనివర్సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవాన్ని సెప్టెంబరు లేదా అక్టోబరులో నిర్వహించనున్నట్లు పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ కే ప్రవీణ తెలిపారు. యూనివర్సిటీ పరీక్షల నిర్వహణ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఏడాది ఫిబ్రవరిలో 4వ స్నాతకోత్సవానికి నోటిఫికేషన్ వేసినట్లు తెలిపారు. కానీ అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని తెలిపారు. తాజాగా స్నాతకోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. స్వర్ణ పతకాలు, పట్టాల కోసం అప్పుడు దరఖాస్తు చేసుకున్న వారు కాకుండా, ఈ ఏడాది టాపర్లుగా నిలిచిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అందుకు వచ్చే నెల 16 వరకు గడువు ఉందని తెలిపారు. అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు, దరఖాస్తు ఫారం కోసం యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేయాలి


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పురుషోత్తం రెడ్డి


తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూసి ఆందోళన చెందుతున్న రైతు పరశురాం

వనపర్తి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల్లో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే రైతులతో కలిసి పోరాటాలు ఉధృతం చేస్తామని సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి మండల పరిధిలోని చందాపూర్‌లోని కల్లాల్లో తడిసి మొలకలొచ్చిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. తడిసి ధాన్యం చూసి ఆందోళన చెందుతున్న రైతు పరశురాంను పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు బోనస్ అంటే రైతులను కల్లాల్లో కాపలా పెట్టడమే బోనస్ అని అర్థవుతుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, చిన్న నరసింహ, బాలరాజు, సంపత్ కుమార్, డాకేష్, తిమ్మయ్య, ఎల్లస్వామి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి.. 8 రోజుల జైలు శిక్ష

మూసాపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి 8 రోజుల జైలు శిక్ష విధించినట్లు మూసాపేట ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం సంకలమద్దిలోని బంగ్లాగడ్డ కాలనీకి చెందిన మాల చంద్రాయుడు ఈ ఏడాది జనవరి 10న జాతీయ రహదారి వేములస్టేజీ వద్ద డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం అతడి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 8 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

అర్హులందరికీ రేషన్ కార్డులు

» తహసీల్దార్ కిషన్‌నాయక్



భూత్పూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు వస్తాయని తహసీల్దార్ కిషన్‌నాయక్ అన్నారు. ప్రజాపాలనలో 4,734 మంది రేషన్‌కార్డుల కోసమే ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకున్నారని, విచారణ జరిపి అర్హులకు రేషన్‌కార్డులు అందజేస్తామని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

మండలంలో ఎన్ని రేషన్‌కార్డులు ఉన్నాయి?

మండలంలో 12,406 రేషన్ కార్డులు ఉండగా, వాటిలో 928 అంత్యోదయ కార్డులు, 26 మందికి అన్నపూర్ణ కార్డులు, 11,452 మందికి రేషన్ కార్డులు ఉన్నాయి.

సిబ్బంది విధులు సరిగ్గా నిర్వహించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి?

మండల కార్యాలయంలో 21 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, డిటీ వీరందరినీ పర్యవేక్షిస్తారు. ఇక విధుల విషయంలో అందరు సమయానికి వచ్చి పని చేస్తున్నారు.

ఇసుక, మట్టి అక్రమ రవాణా జరగుతోందని ఆరోపణలు ఉన్నాయి?

గ్రామ స్థాయిలో రెవెన్యూ సిబ్బంది లేకపోవడంతో గ్రామాల్లో ఏం జరుగుతుందో తెలియడం లేదు. పక్కా సమాచారం ఇస్తే ఆర్‌ఐల చేత విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రభుత్వ భూములు ఏమైన ఆక్రమణకు గురి అయ్యాయా?

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు సమాచారం లేదు. అమిస్తాపూర్ శివారులో 527 సర్వే నంబరులో 38 ఎకరాల భూమిని వేరే వారికి కేటాయించారంటూ బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. అక్కడ భూ కేటాయింపు జరగలేదు.

న్యూస్ బాక్స్

మంజూరీ పత్రాల అందజేత

జడ్చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని అన్ని వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు మంజూరీ పత్రాలు అందజేశారు. మంగళవారం మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కలిసి మంజూరీ పత్రాలు అందజేశారు. కౌన్సిలర్లు శశికిరణ్, రమేశ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు తుంగ రఘు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరుద్యోగ, యువతీ, యువకులు ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జర్దోషి, కంప్యూటర్, ఏసీ మెకానిక్, మొబైల్ రిపేర్, సీసీ కెమెరా, హౌస్ వైరింగ్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ అందజేస్తామని తెలిపారు. 17వ విడత శిక్షణ కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా, పాత డీఈవో కార్యాలయంలో గల వృత్తి శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గోవులకు ప్రత్యేక పూజలు

జడ్చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని సత్యనారాయణస్వామి ఆలయ గోశాలలో మంగళవారం అమావాస్య సందర్భంగా గోవులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రాజాపూర్ తహసీల్దార్‌గా రాధాకృష్ణ



రాజాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రాజాపూర్ తహసీల్దార్‌గా రాధాకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై రాజాపూర్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి మహమ్మదాబాద్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

ఆసిఫ్‌బేగ్‌ను సన్మానించిన బీఆర్‌ఎస్ నాయకులు

భూత్పూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ హ్యాండ్ బాల్ పోటీల్లో రాణించి దేశానికి పేరుతెచ్చిన మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన ఆసిఫ్‌బేగ్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ. షాదిక్, ఎండీ.షాకీర్ గ్రామానికి వెళ్లి శాలువాతో సన్మానించారు. ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు ఒమెన్ దేశంలో నిర్వహించిన 10వ ఏసియన్ బీచ్ హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో భారతదేశం నుంచి ఆసిఫ్‌బేగ్ ఎంపికై పోటీల్లో రాణించాడు.

మహిళలకు చీరల పంపిణీ

రాజాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చొక్కంపేటలో కోటమైసమ్మ బోనాల పండుగ సందర్భంగా మంగళవారం ఆ గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు చించోడ్ అభిమన్యురెడ్డి గ్రామంలోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాన్నమ్మ చించోడ్ రేణుకాదేవీ జ్ఞాపకార్థంగా చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ నర్సింములు, మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్య, సేవ్యానాయక్, నీలమ్మ, జ్యోతి, యాదయ్య, రాజు, అజీమోద్దీన్ పాల్గొన్నారు.

రైల్వేగేటు మూతతో.. వ్యాపారాలు వెలవెల

» బస్టాండ్‌లోకి రాని ఆర్టీసీ బస్సులు » ప్రయాణికులకు తప్పని తిప్పలు



దేవరకద్రలో రైల్వే గేటు దగ్గర నిర్మానుష్యంగా మారిన ప్రాంతం

దేవరకద్ర, 27 మే (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైల్వే గేటును మూసివేయడంతో వ్యాపారాలు వెలవెల బోతున్నాయి. ఇప్పటికే కొందరు దుకాణాలు మూసివేయగా, మరి కొందరు ఖాళీ చేయకుండా ఎదురుచూస్తున్నారు. జన సంచారం లేకపోవడం, వ్యాపారాలు నడవక షాపుల కిరాయి కూడా కట్టని పరిస్థితి నెలకొందని దుకాణ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కొత్త బస్టాండ్ వద్ద కూడా ప్రజల సందడి తగ్గింది. చాలా బస్సులు బస్టాండ్‌లోకి రాకుండానే ఫ్లైఓవర్ మీదుగా నేరుగా వెళ్తున్నాయి. దీంతో హైదరాబాద్, రాయచూరు, మహబూబ్‌నగర్ వెళ్లే ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్వోబీ వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోవడం, సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక వేళ బస్టాండ్‌లోకి బస్సులు వచ్చినా కూడా ఆర్వోబీ నిర్మాణం ఇరుకుగా ఉన్న కారణంగా యూటర్న్ తీసుకోవడానికి వీలులేని పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అండర్‌పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని వ్యాపారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి..

ఆర్వోబీ వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో వంతెనపైకి వెళ్లి దిగువకు వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశాక ఆర్వోబీని ప్రారంభిస్తే సమస్య ఉండేది కాదు. అధికారులు వెంటనే స్పందించి సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలి.

- ఎల్లప్ప, ప్రయాణికుడు

బస్సులు రాక ఇబ్బంది..

రైల్వే గేటును మూసివేయంతో బస్సులు బస్టాండ్‌లోకి రావడం లేదు. ఆర్వోబీ చివరన మండుటెండలో బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సు కోసం కిలో మీటర్ నడిచి రావల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి బస్టాండ్‌లోకి బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

- నరేందర్, ప్రయాణికుడు



నవాబ్‌పేట, మహబూబ్‌నగర్‌లలో నెహ్రూ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి

జడ్చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని మంగళవారం జడ్చర్లలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలోని నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాదేపల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజేందర్‌గౌడ్, నాయకులు బుర్ల వెంకటయ్య, మినాజ్, బాదిమి రవి శంకర్, బుక్క వెంకటేశ్, కాట్రేపల్లి లక్ష్మయ్య, గాంగ్యానాయక్, అయ్యన్న, ఆనంద్, గోపాల్ నాయక్, రాఘవేందర్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

● నవాబ్‌పేట : జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మార్కెట్ చైర్మన్ హరలింగం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య మాట్లాడుతూ నెహ్రూ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూపాల్‌రెడ్డి, హమీద్ మహేక్, నీలకంఠం, వెంకటయ్య, శివకుమార్, అంజన్‌కుమార్ యాదవ్, నర్సింహులు, రాజేష్, ఆనంద్, భాస్కర్ నాయక్, సత్యంగౌడ్, సంతోష్ నాయక్, రాములు, బాలరాజు, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● రాజాపూర్ : మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్, డైరెక్టర్ పంచాక్షరి, నరహరి, కృష్ణయ్య, అశోక్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ న్యూటౌన్ : మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని టీసీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజా సంక్షేమం సాధ్యం అన్నారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ జీనే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు అక్బర్, గులాం జహీర్, పీర్‌సాధిక్, అంతయ్య, నాగరాజు, వెంకటలక్ష్మి, జగదీష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సుందరకాండ వచనం

» ఆంజనేయుడికి 11,116 ఆకులతో ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

జడ్చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటలోని చంద్రమౌళి ఈశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సుందరకాండ వచనం మంగళవారంతో ముగిసింది. కావేరమ్మపేటకు చెందిన పోల వెంకయ్య ఆధ్వర్యంలో దీక్షితుల సుబ్రహ్మణ్యం సుందరకాండ వచనం చేశారు. ముగింపు సందర్భంగా ఆంజనేయస్వామికి 11,116 ఆకులతో ఆకుపూజ చేశారు. సీతారాముడికి అభిషేకంతో పాటు రాముడికి పూజ పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భవానీ ఆలయం నుంచి శివాలయం వరకు సీతారాముడు, లక్ష్మణుడు, హనుమంతుడు విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నమయ్య సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోల రవీందర్, పోల విజయ్, పోల శ్రీనివాసులు, పోల జగదీశ్, అశోక్, చెన్నయ్య, బుక్క వెంకటేశ్, బుక్క నారాయణ, బుక్క లక్ష్మయ్య, బుక్క చెన్నయ్య, లావణ్య, సుమతి, సునీత, అరుణ, పద్మ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

నిషేధిత పత్తి విత్తనాలతో పంటలు వేయొద్దు

జడ్చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత పత్తి విత్తనాలతో పంటలు వేయొద్దని జడ్చర్ల ఏవో గోపీనాథ్ సూచించారు. మండలంలోని నసరుల్లాబాద్‌లో నిషేధిత పత్తి విత్తనాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత పత్తి విత్తనాలతో పంటలు పండించవద్దని తెలిపారు. హెచ్‌టీ (హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలు వాడితే చర్మ సంబంధిత వ్యాధులతో పాటు నేల కాలుష్యంతో పాటు ఇతర విత్తనాలు సైతం కలుషితం అవుతాయని వివరించారు. ప్యాక్ చేయకుండా, లూజుగా విక్రయించే విత్తనాలపై వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని, అలాంటి విత్తనాలను కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. ఏఈవో సాయికుమార్, రైతులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీలు

జడ్చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని సీడ్స్ దుకాణాల్లో మంగళవారం టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు సీడ్స్ దుకాణాల్లో లైసెన్స్‌లను పరిశీలించి, స్టాకు రిజిస్టర్ మేరకు ఉన్న నిల్వలు, ఇన్వాయిస్, బిల్లులు తదితర వాటిని తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, బీజీ-3 రకం పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారా? అనే అంశంపై ఆరా తీశారు. అడ్డాకుల ఏడీఏ బ్యూలా, జడ్చర్ల ఏవో గోపీనాథ్, జడ్చర్ల ఎస్‌ఐ మల్లేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

బాలానగర్ : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో అనిల్‌కుమార్, ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉడిత్యాల్, చిన్నరేవల్లి, పెద్దరేవల్లి, హేమాజీపూర్ గ్రామాలతో పాటు బాలానగర్ మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను వారు ఆకస్మీకంగా తనిఖీ చేశారు. నాసిరకం, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



జడ్చర్లలోని సీడ్స్ దుకాణంలో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం



ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

రోడ్డు డిజైన్ మార్చాలి

» ఎంపీ డీకే అరుణకు అఖిలపక్షం నాయకుల వినతి

జడ్చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ నుంచి పాతబజారుకు నేరుగా రోడ్డు సౌకర్యం కల్పించేలా, సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న జాతీయ రహదారి రోడ్డు డిజైన్‌ను రీడిజైన్ చేయించాలంటూ మంగళవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు జడ్చర్ల అఖిలపక్షం నాయకులు వినతి పత్రం అందజేశారు. మహబూబ్‌నగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలిసి, జాతీయరహదారి నిర్మాణంకు సంబంధించిన డిజైన్‌లో లోపాలు ఉన్నాయని, దీంతో పాతబజారుకు ఆరు మీటర్ల ఎత్తు ఉన్న వాహనాలు నేరుగా కాకుండ, నెహ్రూ చౌరస్తా నుంచి యూ టర్న్ చేసుకుని తిరిగి వెనక్కి వచ్చి పాత బజారుకు వచ్చేలా రోడ్డు నిర్మాణం జరుపుతున్నారంటూ వివరించారు. ఈ అంశంపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, అఖిలపక్షం నాయకులు సీతారాంరూవార్, పిట్టల మురళి, హఫీజ్, రంజిత్‌బాబు, ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వీడియో శ్రీను పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థ పరిధిలోని అప్పన్నపల్లిలోని కేకే రిసార్ట్‌లో మంగళవారం కౌకుంట్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992-93 పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు శ్రీకర్, చింతల వెంకట్ స్వామి, గణేష్, సురేందర్ పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

వనమహోత్సవం కార్యక్రమానికి సిద్ధం కావాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా జూన్ మొదటి, లేదా రెండో వారంలో చేపట్టే వన మహోత్సవ కార్యక్రమానికి అన్ని విధాలుగా సిద్ధం కావాలని కలెక్టర్ విజయేందిర బోయి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వన మహోత్సవ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో 58 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామని, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. అదే విధంగా మండల స్థాయిలో సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయా శాఖలు మొక్కలు నాటేందుకు సైట్లను ఎంపిక చేసి, టీజీఎఫ్‌ఎంఎస్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఎఫ్‌వో సత్యనారాయణ, డీఆర్డీవో నర్సింహులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

మహబూబ్‌నగర్ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా మంగళవారం ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అంతకుముందు వీరన్నపేట రమణగుట్టపై గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో టీడీపీ నాయకుడు ఆర్.బాలప్ప, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, రాష్ట్ర కార్యదర్శి ఖాసీం, ఆలయ ధర్మకర్త కంకర కృష్ణయ్య, అధ్యక్షుడు సత్యం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నారాయణ, అంజన్‌కుమార్, సురేష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సాయన్నగౌడ్, వెంకటయ్య, సాగర్, వెంకటేశ్వర్లు, మహబూబ్‌నగర్ మండల అధ్యక్షులు మురళి, శ్రీనివాస్‌గౌడ్, యాదయ్యగౌడ్, వెంకటరాములుగౌడ్, అంజయ్య మహానాడుకు తరలివెళ్లారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

భూత్పూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి పలువురికి రూ.7 లక్షల నిధులు మంజూరు కాగా, మంగళవారం లబ్ధిదారులకు మద్దిగట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్ ఆధ్వర్యంలో బాధితులకు అందించారు. నాయకులు మలిశెట్టి వెంకటేష్, మాజీ సర్పంచులు సంజీవరెడ్డి, ముడావత్ హర్యానాయక్, రఘుపతిరెడ్డి, భూపతిరెడ్డి, కప్పెట వడ్డె శ్రీను, ఎర్రవాపు నర్సిములు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాయిలు, తాటికొండ రవీందర్‌రెడ్డి, తిరుపతయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ కార్మికుడికి పీఎఫ్ అమలు చేయాలి

పాలమూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని వాణిజ్య సంస్థలు, ఫైనాన్స్‌లు, షాపింగ్ మాల్స్ హోటల్స్, పారిశ్రామిక వాడల్లో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్ అమలు కావటం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఎం ఆర్ షాపింగ్ మాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు పీఎఫ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి, బాలదేవసింగ్, ఈఎస్‌ఐ ఆఫీసర్ ఖాజాఖాన్ హాజరయ్యారు. పీఎఫ్ అమలు చేయని కంపెనీలు, యాజమాన్యాలపై, సంస్థలపై పీఎఫ్ అధికారులు తనిఖీ చేసి, పెనాల్టీలు విధించాలన్నారు. ప్రతీ వాణిజ్య సంస్థలోనే ఆటో మొబైల్ ఏజెన్సీలోను పరిశ్రమల్లోనూ పీఎఫ్ అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించాలన్నారు. లేకపోతే మిగిలిన కార్మిక సంఘాలతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

విద్యార్థుల హాజరు పెంచాలి

మూసాపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంపొందించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని అడ్డాకుల ఎంఈవో కురుమూర్తి అన్నారు. మంగళవారం అడ్డాకుల ఎమ్మార్సీలో పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి, మాట్లాడారు. సీఆర్పీ చెన్నయ్య, ఐఆర్పీ శివశంకర్ పాల్గొన్నారు.

● రాజాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు రంగారెడ్డిగూడ, తిరుమలాపూర్, కేజీబీవీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో సుధాకర్ మంగళవారం పాఠ్య పుస్తకాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకే ప్రభుత్వం సకాలంలో పాఠ్య పుస్తకాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హన్వాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని చిన్నదర్పల్లిలో చేటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని దొర్రితండా గ్రామపంచాయతీలోని పల్లుతండాకు చెందిన లక్ష్మన్‌నాయక్ (30) బైక్‌పై మహబూబ్‌నగర్ నుంచి పల్లుతండాకు వస్తుండగా చిన్నదర్పల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తల పగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఘనంగా అహిల్యా బాయి జయంతి

హన్వాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం బీజేపీ నాయకులు హిందూధర్మ రక్షకురాలు మహారాణి అహిల్యా బాయి హోల్కర్ 298 జయంతిని ఘనంగా నిర్వహించారు. హన్వాడ, కొత్తపేట, టంకర, వేపూర్, పుల్పోనిపల్లి, గొండ్యాల, ఇబ్రహీంబాద్, నాయినోనిపల్లి గ్రామాల్లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొండ లింగం, జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డి, జిల్లా నాయకులు వడ్ల శేఖర్, కృష్ణయ్యగౌడ్, రఘురాంగౌడ్, వెంకటేష్, వేణు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



తహసీల్దార్ కిషన్‌నాయక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూత్పూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కిషన్‌నాయక్‌ను మంగళవారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, కొత్తమొల్గర వెంకటేష్, తాటికొండ రవీంధర్ రెడ్డి, నర్సిములు, కప్పెట శ్రీనివాస్, భూపతిరెడ్డి, హర్యానాయక్, కప్పెట టీవీరెడ్డి, మాసగౌడ్, కట్టప్ప, సాయిలప్ప, తమ్మప్ప పాల్గొన్నారు.

● గండీడ్ : నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ మల్లికార్జున్‌రావును మంగళవారం కార్యాలయంలో డీలర్లు, గండీడ్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రాకం కేశవులు, బాబ్రీ, గంగాధర్, శేఖర్, శ్రీనివాసులు, వెంకట్‌రాములు డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న కరెంట్‌షాక్‌లు

» వారం రోజుల్లో ముగ్గురి మృతి

» ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజల వేడుకోలు

చిన్నచింతకుంట, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో కరెంట్‌షాక్‌లు ప్రజలను కలవరపెడుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో వేర్వేరు ఘటనల్లో వారం రోజుల్లోనే ముగ్గురు విద్యుదాఘాతంతో మృత్యువాత పడటం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. ఈనెల 18న కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలో పెద్ద గొల్ల చంద్రన్న ఇంటి ముందు కట్టెలు కొడుతుండగా విద్యుత్ తీగలు తెగిపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే 23న చిన్నచింతకుంట మండలం పర్దిపూర్ గ్రామంలోనూ తెలుగు కమలన్న కూలీ ఇంటి నిర్మాణానికి సంబంధించిన పిల్లర్లకు నీళ్లు పడుతుండగా, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇక తాజాగా ఈనెల 25న చిన్నవడ్డెమాన్‌లో గ్రామానికి చెందిన బోయ పెద్ద భీమన్న అనే వ్యక్తి ఇంటి అవసరాల కోసం కట్టెలు తీసుకురావటానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మండలంలో వరుస విద్యుదాఘాతంతో మృత్యువాత పడటంతో.. ప్రమాదాల నివారణకు విద్యుత్ అధికారులు వ్యవసాయ పొలాలు, ఆయా గ్రామాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.